
# లైబ్రరీలో

—ఎ.వి. రెడ్డి శాస్త్రి

వీలయినంతసేపు లైబ్రరీలోనే గడుపుతుంటాను కాలాన్ని. దానికి పెద్ద కారణమేమీ లేదు— వెళ్లడానికి నాకో చోటంటూ లేకనే. లైబ్రరీ మూసేసిన తర్వాత— అక్కడా ఇక్కడా పరిచయస్తుల గదుల్లో గడిపేస్తుంటాను.




స్నేహితులెవరూ లేరునాకు. స్నేహాల కోసం ప్రయత్నించడం నాకు చేత కాదు కూడాను. ఎవరితోనైనా చెప్పుకోవలసి నంత ముఖ్యమయిన విషయాలేవీ లేవునాకు. అలాగే విని తీర వలసి నంత గొప్ప విషయాన్ని నాకింత వరకూ ఎవరూ చెప్పలేదు. బహుశా నాయీనిర్లిప్త స్వభావం తెలిసే కాబోలు, పరిచయస్తులు నన్ను వాళ్ల గదుల్లో వుండనిస్తుంటారు అప్పుడప్పుడూ.

"మాట్లాడని ఆలోచనా ప్రవంతి" అని అంతా కలిపి నీకు ముద్దు పేరు పెట్టేరు తెల్సునా" అంది రజని ఒకనాడు. రజని గురించి ఎలా చెప్పాలి? నా స్నేహితురాలా? అబ్బే, అలా అన్లేను. అయితే మరెవరూ? అదీ చెప్పలేను. నేనెందుకు యీ ప్రపంచంలో వున్నానో, రజని కూడా అందుకే వుంది. నాకున్న తిక్క వెధవ ఆలోచన్లే రజనికీ వున్నాయి. అంచేతనే కాబోలు మా యిద్దరి మధ్యనే పరిచయం. నేనెప్పుడేనా రజని తోనే నాలుగు మాటలు మాట్లాడతాను. అయితే రజని మాత్రం నిత్యం గలగల లాడ్తుంటుంది. "అసలే కాళ్లు లేనిది కాలం. మాటలేనా లేకపోతే ఎలా బతకడం!" అంటుంది రజని. నవ్వేస్తుంటా న్నేను.

"ఇవాళ నీతో మాట్లాడాలి-లైబ్రరీ శాస్త్రిను" అని ఓ చీటీ లైబ్రరీలో నేను చదువుకొనే టేబిల్ మీద కనబడింది. నాతో మాట్లాడాలని సంతకం చెయ్యని చీటీ ఎవరు రాస్తారు, రజని తప్ప? అయితే, ఈ చీటీ రజని రాసిందేనని కూడా ఖచ్చితంగా చెప్పలేను. ఎంచేతంటే, ఇన్నాళ్ల పరిచయంలోనూ రజని దస్తూరి ఎలా వుంటుందో చూడ్లేదు నేను. కాని ఈ చీటీని తప్పకుండా రజనే రాసి వుంటుందని నమ్మి, ఆమె కోసం వెయిట్ చెయ్యడానికి నిశ్చయించుకున్నాను.

మా లైబ్రరీ చాలా పెద్దది. పెద్దదే కాకుండా చాలా పురాతన మయింది కూడాను. "ఈ లైబ్రరీని పూర్తిగా చదివేయగలిగితే, ప్రపంచాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నట్టే" అని ప్రొఫెసర్ డస్ట్‌కోట్ **(Dustcoat)** గారు ఒక సారన్నారు. ఆయన మాకు అమెరికన్ పొయిట్రీ చెప్పేవారు. ఒకసారాయన జాన్ క్రోరేన్సమ్ **(John Crowe Ransom)** రాసిన **Piazza Piece** పద్యం చేస్తూ **"I am a gentleman in a dustcoat"** అన్న మొదటి వాక్యాన్ని వుత్సాహంగానూ, ఉద్రేకంగానూ చదివేరు. స్టూడెంట్స్‌ని బాగా ఇన్‌స్పైర్ **(Inspire)** చెయ్యాలని కాబోలు అతని తాపత్రయం. సరే, ఇన్‌స్పైర్ చెయ్యడం మాటెలా వున్నా, అతనికి మాత్రం ఆవేళ నుండి 'ప్రొఫెసర్ డస్ట్ కోట్' అనే బిరుదుని స్థిరపరిచేరు విద్యార్థులు. రేన్సమ్ రాసిన పద్యంలో ఒక అందమైన, సుకుమార మైన అమ్మాయి ప్రియుడి కోసం వెయిట్ చేస్తుంటుంది వరండాలో. అయితే ఆ అమ్మాయిని కబళించడానికి మృత్యువు పొంచి వుంది. పూల తీగల వెనకాతల ఆ మృత్యువే ఈ డస్ట్ కోట్ పెద్ద మనిషి! మా ప్రొఫెసర్ గార్కి, ఈ మృత్యు సంకేతానికి కొన్ని పోలికలున్నాయి. విద్యార్థులు ఏం రాసినా, ఎంతరాసినా **(Trash)** ట్రేష్ గానే కనిపించేది ఆయనకి. దేనితోనూ తృప్తి పడని ఆయన మనస్తత్వంవల్ల అనేక మంది విద్యార్థుల కెరియర్లు నాశనమయ్యాయి. అయితే, ఎవరేమయినా, ఏమనుకున్నా మృత్యువు ఏ విధంగా పట్టించుకోదో, అదే విధంగా ప్రొఫెసర్ గారుకూడా నిర్లిప్తతకి ప్రతీక లాగ వుండేవారు. అందుకని 'డస్ట్‌కోట్' బిరుదు ఆయనకి అన్ని విధాలా సరిపోయింది.

అదిగో ఆ ప్రొఫెసర్ గారే అన్నారు మా లైబ్రరీ నంతట్నీ చదివేస్తే ప్రపంచాన్ని అర్థం చేసుకున్నట్టేనని, కాని ఈ లైబ్రరీని ఎవరూ

పూర్తిగా చదివినట్టు దాఖలాలేదు. అంతెందుకు, ప్రొఫెసర్ డస్ట్ కోట్‌గారు ఈ లైబ్రరీ నంతట్నీ చదివేయాలని ఎంతో కాలం నుంచీ ప్రయత్ని స్తున్నాడుగాని చదవ గలిగేడా? పూర్తి లైబ్రరీ సంగతలా వుంచి, కనీసం యిందులోని ఇంగ్లీషు విభాగాన్నైనా పూర్తిగా చదవలేదింకా అని ఆయన నోటితో ఆయనే చెప్పేడు. 'ఇంకా' అని ఎందు కన్నా నంటే, ఆయన ఇంకా, యిప్పటికీ లైబ్రరీ తెరిచిన దగ్గర్నుండి లైబ్రరీ మూసే సిందాకా, ప్రతి రోజూ చదువుతూనే వున్నాడు. అయిదు వందల సంవత్సరాల వయస్సున్న వాడ్లా కని పిస్తాడతగాడు. నడుం వంగి పోయింది. దృష్టి మందగించింది. అడుగులు తడబడుతున్నాయి. ఆయన దశాబ్దాలుగా తొడుగుతున్న కోటు బాగా మాసిపోయి, చిరుగులు పడింది. ఇన్ని జరుగు తున్నా చదువు మాత్రం ఆపలేదాయన. ఏదో గొప్ప సమస్యకి పరిష్కారం కనుక్కోవడం కోసం గత ఏభై ఏళ్ళుగా శ్రమిస్తున్నాడు. అయినా ఇంకా కనీసం వుపోద్ఘాతం కూడా రాయడం కాలేదు.

నేను కూడా నా కాలాన్నంతట్నీ లైబ్రరీలోనే గడుపుతుంటాను కాబట్టి, తరచు మేమిద్దరం ఒకరి కొకరు తారస పడుతుంటాం. ఇప్పుడు మా మధ్యని 'ప్రొఫెసర్-పూర్వ విద్యార్థి సంబంధం' అంతరించి పోయి, ఒక కొత్త అవగాహన ఏర్పడింది. మే మిద్దరం తెలియని దేనికోసమో నిరంతరాన్వేషణ సాగిస్తున్న పరిశోధకులం. ఇంత వరకూ మాకు తెలిసింది పరాజయమే తప్ప, విజయం యేదీ లేదు. అంచేత ఒకరి పరాజ యాన్ని ఒకరం వుండుండి ఎద్దేవా చేసుకునేస్థితి కొచ్చేం.

చెప్పేను కదా- నేను రజని కోసం వెయిట్ చేస్తున్నాను. లైబ్రరీలో నా టేబిల్ కాస్త చీకటిగా వుండే ఒక మూలని వుంది. టేబిల్ దగ్గర వుండే లైట్ కొన్నాళ్ల క్రిందట పోయింది. దాన్ని తిరిగి రిప్లేస్ చెయ్యలేదు లైబ్రరీ అధికారులు. నేను కూడా దాని గురించి అంతగా పట్టించుకోలేదు. నా టేబిల్ దగ్గర లైట్లు వెయ్యడం మానేస్తే, చీకట్లో చదవలేక నేను లైబ్రరీ విడిచి వెళ్లిపోతా నని లైబ్రరీ వాళ్లు భ్రమపడుతున్నట్టున్నారు. అవును మరి దశాబ్దాల తరబడీ దయ్యంలా లైబ్రరీ పట్టుక్కొని వేళ్లాడుతుంటే, ఎలాగైనా నన్ను లైబ్రరీ నుండి తరిమెయ్యాలని వాళ్లు భావించడంలో తప్పులేదేమో! అయితే, నాకు యింతవరకు అంతుబట్టకుండా దాగుడు మూత లాడుతున్న 'ఆ విషయాన్ని' ఆకళింపు చేసుకో కుండా, యీ లైబ్రరీని వదిలి వెళతానా? వెళ్లను గాక వెళ్లను.

నన్ను లైబ్రరీ నుండి తరిమెయ్యాలనే కృషిలో భాగంగా అధికారులు ''మీరు దేన్ని గురించి పరిశోధన సాగిస్తున్నారో రాసివ్వండి'' అని తాఖీదు పంపించేరు. ''అది తెలుసుకో డానికే ప్రయత్నం సాగుతోంది'' అని సమా ధానం పంపేను. దేన్ని గురించి పరిశోధన సాగిస్తు న్నాడో ప్రొఫెసర్ డస్ట్‌కోట్ లాంటి వాడికే అంతుబట్టనిది నాకు మాత్రం తెలిసి వస్తుందా ఏమిటి?

సరే, రజని కోసం వెయిట్ చేస్తున్నాను నా టేబిల్ దగ్గర కూర్చుని. నా టేబిల్ దాటి మరి కాస్త ముందుకు వెళితే మరింత దట్టంగా చీకటి అలముకొన్న మరో మూలని ప్రొఫెసర్ డస్ట్‌కోట్ గారి టేబిల్ వుంది. ఆయన్ని కూడా లైబ్రరీ నుండి తరిమెయ్యాలనే ప్రయత్నంలో వున్నట్టు న్నారు లైబ్రరీ వాళ్లు. ఉన్నట్టుండి ఒకనాడు ఆయన టేబిల్ దగ్గ రుండే లైటుని తొలగించేశారు. ఆయన కూడా ఏమీ నొచ్చుకోలేదు, ఈ దుశ్చర్యకి. నాలాగే చీకటి వెలుగులకతీతమయింది తన పరిశోధన అనే నిర్లిప్త ధోరణి కనపర్చేడు. ఏతావాతా మేమిద్దరం ఇప్పుడు నిజమైన చీకటి పరిశోధకులమన్నమాట!

రజని కోసం వెయిట్ చేస్తున్నాను. మెల్లమెల్లగా చీకటి ముసురుకుంటోంది. ఈ పాత పుస్తకాల ముక్కవాసన మధ్యని ఎంతకని కూర్చుంటానని పించి, బయటికి బయల్దేరేను, ఓ సిగరెట్టైనా వెలిగించుకుందామని. సరిగ్గా అదే సమయానికి ప్రొఫెసర్ డస్ట్ కోట్ కాళ్లీ డ్చుకుంటూరావడం కనిపించింది. మాట్లాడుకోడానికి మాత్రం అసలేంవుందిలే ఈ ప్రపంచంలో అనే భావం మా యిద్దర్లోనూ ఈ మధ్యని బాగా వ్యాపించినట్టుంది - అంచేత ఒకరితో ఒకరం మాట్లాడుకోడం బాగా తగ్గించేశాం. కాని యివాళ అతనికేం బుద్ధి పుట్టిందోమరి, నన్ను చూసి ''ఎక్కడ్నుంచోయ్'' అన్నాడు. తెలీదూ, ముసలి పీనుక్కి నేనెక్కడి నుండి వస్తున్నానో? సడన్‌గా నాకెందుకో కోపం వచ్చేసింది. తిక్కగా సమాధానం యిచ్చేను "చీకట్లోంచి" అని. సమాధానం కాస్తా నోట్లోంచి బయట పడగానే, అతన్ని ఏడిపిస్తే ఎలా వుంటుం దనే ఆలోచన వచ్చింది. వ్యంగ్య స్వరంతో అడిగేను ''తమ రెక్కడికి'' అని. ''చీకట్లోకి'' అని సమాధానం యిచ్చేసి, కాళ్లీడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

చెంప పెట్టులాంటి ఈ సమాధానం వినగానే నాకు పిచ్చెక్కినంత పనయింది. కానీ మనసు మూలల్నుండి చిన్న సందడి వినపడింది ''ఆయన చెప్పిందాన్లో అబద్ధం లేదు కదా'' అని. దాంతో నా కోపం నీరుకారిపోయింది. ఒక్క క్షణం పాటే అయినా కోపం వచ్చినందుకు నన్ను చూస్తే నాకే నవ్వు వచ్చింది. ఈ ప్రపంచంలో కోపం తెప్పించగలిగే సన్నివేశాలు యింకా మిగిలే వున్నాయా? లేక ప్రపంచం గురించి నాకున్న వూహల్లోనే ఏదైనా పొరపాటుందా? ఏది ఏమైనా కారిడర్ మధ్యలో యిలా నిలబడిపోయి స్వగతించడం సబబుకాదు. రజని యింకా

## మనకు తెలియని మన ఆంధ్రుడు

ఆంధ్రుల శక్తి సామర్థ్యాలు ఆంధ్రులకే అర్థం కాదని వెనక ఒక కవిగారు శెలవిచ్చారు. ఇటీవలి కాలంలో ఆ మాట చాలా వరకు నమ్మ అయినా ఒకనాటి అసలైన మన మేధావులను, వారు ప్రదర్శించిన ఔన్నత్యాన్ని వింటున్నప్పుడు ఇప్పటి మన శక్తి సామర్థ్యాలు సద్వినియోగం చేసుకుంటు న్నామా, దుర్వినియోగం చేసుకుంటున్నామా అని మనమే ప్రశ్నించు కోవాలి. ఒకనాటి గొప్పవారు ఇప్పుడు పూర్తిగా తెరమరుగు అయ్యారు. అలాంటి వారిలో రెంటాల సుబ్బారావుగారు ఒకరు. ఆయన వృత్తి రీత్యా హైకోర్టు వకీలు. ఆయన పేరుకే వకీలు. న్యాయవాదిగా, వ్యాపారదక్షుడుగా, రచయితగా ఆయన ప్రతిభ అద్వితీయం. షేక్స్‌పియర్ నాటకాలలో ఎన్నో వ్యాఖ్యానాలు రాసి సెభాష్ అనిపించుకున్నాడు. హిందూ వితంతువుల ఆవేదనను కమలా లేఖ లన్న పేరుతో కరుణాత్మకంగా ఆంగ్లంలో ప్రకటించాడు. ఆ రోజుల్లో ఆ పుస్తకం ఇరవై అయిదు వేల ప్రతులు అమ్ముడు పోవడం చాలా గొప్ప విషయం. హిందూ లా'ను తెలుగు,తదితర భాషల్లో ప్రచురించారు. విక్టోరియా డిపోను స్థాపించి అనేక గ్రంథాలు, మందులు తయారు చేసి దేశ దేశాలు వ్యాపింప చేశాడు. భారతీయ ప్రకృతి చిత్రాలను, మన వూరగాయల్ని ప్రప్రథమంగా విదేశాలకు పంపించిన ఘనుడు - ప్రపంచంలో ఎక్కడ ఏ కొత్త వస్తువుందో తెలుసుకుని వ్యాపారాలు చేసి లక్షలార్జించిన ఆనాటి ప్రముఖ వ్యాపారవేత్త, తెరమరుగైన ఓ దక్షుడు. ఇలాంటి వారెందరున్నారో మనకి తెలియని అజ్ఞాతులు.

— జె. లలితాదేవి

## శరీర సంభాషణ

నాకేమో తన శరీరంతో మాట్లాడాలని
మౌనమై పొట్టుకుంటూ మనస్సులోకి పోవాలని
శరీరానికీ భాష వుంటుంది
అలా సంభాషణ ప్రారంభిస్తేనా
ఆమె శరీరం మౌనం వహిస్తుంది
మౌనంలో అదృశ్య ప్రశ్న - ఎప్పుడూ శరీరమేనా
శీతల నిశ్శబ్దాన్ని ఛేదించేదెలాగో తోచదు
ఏమీ తోచదు

ఆ పెదాలపై వెన్నెల నవ్వు మెరిసినా
స్నానానంతర పరిమళం మీదుగా వీచినా
మతిమెత్తని చూపు లాలనగా స్పృశించినా
లోలోపల హిమజ్వాలా తరంగం రేగుతుంది
నిలువెల్లా ఉద్రిక్త గీతం వెంటాడుతుంది

ఇద్దరి మధ్యా స్థలకాలాలు విస్తరించినప్పుడు
స్పర్శా రాహిత్యం బాధిస్తుంది
తొలిచూపు మొదలుకొని
వేయిన్నొక్క జ్ఞాపకాలు బాధిస్తాయి
ఏకాంతంలోనూ బహిరంగంలోనూ
శరీరాన్ని నిశ్శబ్దీకరించటం బాధిస్తుంది

హిమజ్వాలా తరంగాన్ని
విశృంఖలంగా విడుదల చెయ్యలేక పోవటం

వంటా అంట్లూ బట్టలూ పిల్లలూ-
పగలంతా తన దేహాన్ని బడలికగా విట్టూర్పుగా
మార్చిన పిమ్మట
బలవంతాన మాట్లాడించటం నా కిష్టముండదు
అలా మాట్లాడించిన వేళ నా పశ్చాత్తాపానికి
అంతుండదు

బహుశా శరీరానికీ సమయముంటుంది
ద్వయీ సంగీతానికి ఒక శ్రుతి మాత్రమే కాదు
మరో లయ కావాలని తెలుస్తుంది

ఒక క్షణాన
పరస్పరం అర్థమైన అర్థవంతమైన క్షణాన
తన శరీరాన్ని కిలకిలగా గుసగుసగా
సగం పలకరింతగా సగం పులకరింతగా మార్చేస్తుంది
గుప్పున సువాసనగా మార్చేస్తుంది
ఆ క్షణాన్ని ప్రేమిస్తాను
కాలం నెత్తిమీద మొట్టి
శరీర సంభాషణ ప్రారంభిస్తాను

— పాపినేని శివశంకర్

రాలేదు. అంచేత అటు బయటికి వెళ్ళి సిగరెట్ వెలిగించుకోడమా? లేక ఎలాగూ ప్రారంభమయింది కనక, ప్రొఫెసర్ గారితో సంభాషణ మరి కాస్త పొడిగించడమా? ముసలాయన్ని కాస్త అల్లరిపెడితే యెలా వుంటుంది? ప్రయత్నిద్దాం- లైఫ్ బొత్తిగా నిర్జీవంగా కనపడుతోంది. వెరైటీ కోసమేనా ప్రొఫెసర్ గార్ని ఆట పట్టించి, ఏడిపించాలి. నిర్ణయం అయిపోగానే వెనక్కి వెళ్లేను ఆయన్ని వెతుక్కుంటూ, పుస్తకాల రేక్స్‌దగ్గర నిలబడి తనక్కావలసిన పుస్తకాలు కనపడకుండా ఎవరో దాచేస్తున్నారని బయటికి వినపడేట్టుగా సణుక్కుంటున్నాడు. వయసు బాగా పెరిగిపోయిందేమో, ఈ మధ్యని అతగాడు తన మనసులో తను అనుకోవాలని సంకల్పించిన మాటల్ని బయటికే అనేస్తున్నాడు. బయటి వాళ్లు తన మాటలు వింటారనే స్పృహ పోయినట్టుంది అతనికి.

నేనతని దగ్గరకి వెళ్లి "ప్రొఫెసర్ గారూ, ఒక ధర్మ సందేహం వచ్చింది వాళ-మీతో డిస్కస్ చెయ్యాలని వుంది" అన్నాను.

"ఆ అదొక్కటే కదా మనకి మిగిలిన కన్సొలేషన్. డిస్కస్ చెయ్యి, ఫర్వాలేదు. కానీ నిర్ణయాల కోసం మాత్రం ఆశించకు. మనం యే నిర్ణయాలూ చెయ్యలేమనే నిర్ణయానికి వచ్చేశాన్నేను" అన్నాడాయన.

కాస్త వెలుతురుగా వున్న జాగా చూస్కోని కూర్చున్నాం. "చెప్పవయ్యా నీ సందేహం" అన్నాడాయన. ప్రారంభించేను. "మరేం లేద్సార్. ఇవాళ కాఫ్కా నవల 'The Trial' చదువుతున్నాను. ఈ ప్రపంచం అనే బందిఖానాలో చిక్కుకున్న మనిషి తాలూకా అసందిగ్ధ పరిస్థితి గురించి ఆయన విశ్లేషణ చాలా ఆసక్తికరంగా సాగుతోంది. ఇంతలో ఎక్కడ్నుండి వచ్చిందో తెలీదుగానీ, ఓ చెదపురుగు పేజీ కింద నుండి దూసుకు వచ్చి, నేను చదువుతున్న వాక్యాల వెంబడి నడకసాగించి నా అవగాహనకి అడ్డు తగులుతోంది. నాకు వొళ్ళు మండిపోయింది దాని యింట్రూజన్‌కి. వెంటనే ఏం చేశానో తెల్సా? కసిగా, ఠకీమని పుస్తకం మూసేసేను. చచ్చూరుకుంది చెద పురుగు" అని చెప్పి ఆపేను. ఇంకా ఏం చెప్తానోనని ఆసక్తితో ఎదురుచూస్తున్నాడతగాడు. నిమిషాలు గడుస్తున్నా నేను నోరు విప్పకపోడం చూసి, మరి వుండబట్టలేక "అయితే ఇంతకీ నీ ధర్మ సందేహం ఏమిటి" అనడిగేడు.

"చెప్తాను మాస్టారూ, కానయితే నవ్వకూడదు సుమండీ. పుస్తకం మళ్లీ తెరిచి చూస్తే తెలిసింది నాకు, చచ్చిపోయిన చెద పురుగు యింకా లేత వయస్సులో వున్న పిల్ల పురుగని. నిన్ననో, మొన్ననో కళ్లు తెరిచి పుస్తక ప్రపంచంలోకి విహారానికి వచ్చినట్టుంది. దానికి బోలెడు భవిష్యత్తుంది. కాల క్రమేణా ఎదిగి మనం చదవలేక పోయిన ఈ మొత్తం లైబ్రరీని కొరికి తినేసే సత్తా దానికి వచ్చి వుండేది. అలాంటిది, దాని వయస్సు యింకా విచ్చీ విచ్చుకోకముందే, దానికి ఆహారం కావలసిన పుస్తకం వాత పడి అర్థాంతరంగా చచ్చిపోయింది కాదా, దీన్ని ఏ తాత్వికతసూక్ష్మంగా విశ్లేషించ గలరంటారు?" అన్నాను. నా గొంతులో ధ్వనించిన అపహాస్యం నాకే ఎబ్బెట్టుగా అనిపించింది. కాని ప్రొఫెసర్ గారు మాత్రం దాన్ని పట్టించుకున్నట్టు లేదు. పైదు మిక్కిలి "అవునయ్యా, నువ్వు చెప్పిన విషయం నా పరిశోధనకి కొత్త మలుపు తిప్పేట్లు కనిపిస్తోంది. కాస్త ఆలోచించి విపులీకరణ యిస్తాను" అనేసి ఆలోచనల్లో పడిపోయాడు. నవ్వాలో ఏడవాలో తెలియలేదు నాకు. నా చచ్చు కథ, వ్యంగ్య ధోరణి అర్థం కాగానే, "రాస్కెల్, నన్నే, ఫూల్‌ని చెయ్యాలని చూస్తావ్రా" అని గంగవెర్రులెత్తి అరుస్తాడని, దాన్ని చూసి ఆనందించాలని నేను ఆశ పడితే, నా కథని విశ్లేషించి కొత్త సారాంశం లాగే వుద్దేశంతో ఆలోచన్లో పడ్డాడీ మహానుభావుడు. ఇంక ఆ టేబుల్ దగ్గర కూర్చోడం అసాధ్యమనిపించి బయటికి వచ్చేశాను.

రజని మాత్రం ఇంకా రాలేదు, సిగరెట్ వెలిగించేను. ఆలోచనలు దోమల్లా ముసురుతున్నాయి. ఆ చీటీని నిజంగా రజనే రాసిపెట్టిందా? తెలీదు. రజనే రాసి వుంటుందని నా నమ్మకం. ఆ నమ్మకం తోనే ఆమె కోసం వేచి చూస్తున్నాను. ఇంతకీ వేచి వుండడం మినహా నాకు వేరే పెద్ద పనులే మున్నాయి గనక. ఈ ప్రపంచంలో? స్కాలర్ జిప్సీ (Scholor Gipsy) లాగ ఏది కావాలో తెలియక పోయినా, దేనికోసమో అలా నిరీక్షిస్తూనే కాలం గడుపుతున్నాను. అంచేత రజని రాక కోసం. ఎంతసేపేనా వేచి వుంటాను- అది నాకు పెద్ద యిబ్బందేం కాదు కాబట్టి.

చీకటి మరింత చిక్కబడింది. చుట్టూ వున్న భవంతుల్లోని దీపాలు క్రమంగా ఆరిపోతున్నాయి. ప్రొఫెసర్ డస్ట్‌కోట్ గార్ని బయటికి పంపించేసి, లైబ్రరీకి తాళాలు బిగించేసి, స్టాఫ్ ఇళ్లకు బయలుదేరి పోయారు. చీకట్లో నేను మిగిలేను, సగం విరిగిన సిమెంట్ బెంచికి చేరబడి! రజని

రాలేదు. చెప్పలేం, ఏ సినిమా దగ్గరేనా ఆలస్యం అయి వుండవచ్చు. ఆవిడ తరచుగా సినిమాలు చూస్తుంటుంది. సినిమాలు అంత ఎక్కువగా చూస్తుంటావెందుకు అని అడిగితే, 'మరి యీ బోర్ డమ్‌ని ఎలా భరించ మన్నావని ఎదురు ప్రశ్న వేసింది. అంచేత ఇంత ఆలస్యం అయినా ఇంకా రాలేదంటే, తప్పకుండా సినిమాకే వెళ్లి వుంటుంది. రజని, వస్తానని రాశాక రావడం మానదు. ఆమె నిజాయితీని నేను శంకించనక్కర లేదు.

ఆకలి వేస్తోంది. అలా ఎటేనా వెళ్లి ఏదేనా తినొస్తే బావుండ్ను. కానీయాలోపల రజని వచ్చి, నేను లేననుకొని తిరిగి వెళ్లిపోతే? ఈ ఆకలి ఈ నాటిదా ఏమిటి? ఫర్వాలేదు. ఒక్క రాత్రికి తిండి తినక పోయినంత మాత్రాన ఆగిపోయేది కాదు- ఈ జీవితం నాది. అవునూ, వాచీ ముల్లకి విసుగెయ్యదు కాబోలు, సంవత్సరాల తరబడి అలా గుండ్రంగా తిరుగుతూ, తిరుగుతూ, తిరుగుతూ వుండడానికి! ఏడిసినట్లే వుంది నా ఆలోచన- అక్కడికి వాచీ ముల్లకీ, మనకీ పెద్ద తేడా వున్నట్లు! కాలం గడుస్తోంది. క్లాక్ టవర్ పన్నెండు గంటలు కొట్టడం లీలగా వినిపించింది. రజని రాలేదన్న విషయం వుండుండి గుర్తుకు వస్తోంది. అయినా, అన్నిటికీ అతీతమయిన నిద్ర ఆవహించేసింది. బెంచీ మీద వొరిగి అలాగే నిద్రపోయాను.

నిద్రలో మంచి కల. ఏనాడూ అంత అందమైన కల నాకురాలేదు. ఆలోచనం కల్లోలాలు, నిర్దయతో కూడుకున్న నిజాలు, నిర్ణయాలు, బాధలు, సమస్యల సంక్షోభాలు, మృత్యువు ప్రసాదించే ముగింపులు- ఇవేవీ లేనటు వంటి అందమైన లోకం. అలాటి అందమైన లోకంలో జీవిస్తున్నట్టు కల. కల బాగా సుదీర్ఘంగా సాగి వుండాలి లేచేటప్పటికి బాగా పొద్దెక్కింది. "మన మెంత పిచ్చి వాళ్ళం! కలలని తెలిసి కూడా, కలల్ని తల్చుకొని సంబర పడిపోతాం" అని అనుకుంటూ కేంటీన్ వేపు నడిచేను. నిత్య కర్మలు ముగించి, లైబ్రరీ చేరుకునే సరికి పది దాటింది. రిఫరెన్స్ సెక్షన్ లో వున్న నా చీకటి టేబిల్ చేరుకుని కుర్చీలో చతికిల బడ్డాను. పని చెయ్యడానికి అంగీకరించని ఆలోచనలు, ఆచరణలోకి దిగనివ్వని బద్ధకం. నిర్వ్యాపారంగా అలా కూర్చుని, టేబిల్ మీద అస్తవ్యస్తంగా పడి వున్న పుస్తకాల వైపుచూశాను. The Trial నవల క్రిందగా నాకు మాత్రం కనపడేటట్టుగా వుంచబడిన వుత్తరం! అంటే, అంటే... కొద్ది సేపు క్రితమే రజని వచ్చి, నేను లేక పోవడం చూసి, లెటర్ రాసి పెట్టేసి, వెళ్లిపోయిందన్నమాట! ఎంత పనయింది! నేను కేంటీన్‌కి వెళ్లకుండా వుంటే, తప్పక రజనితో మాట్లాడ గలిగి వుండే వాడిని కదా! ఛీ! ఛీ, ఆశల ఎండమావి మరో మారు పరుగు తీసింది చేతికి చిక్కకుండా! చెప్పడానికి వీల్లేనంత దిగులు, నిస్పృహ ఆవరించేయి. మళ్లీ మామూలు పరిస్థితికి రావడానికి చాలా ప్రయత్నం చెయ్యవలసి వచ్చింది. ఉత్తరం తెరిచి చదవడానికి ధైర్యం చాల్లేదు చాలా సేపటి వరకూ, చివరికి ధైర్యం వుగ్గబట్టుకొని, ఉత్తరం తెరిచి చదివేను.

"నిన్నను వస్తానన్నాను. నా కోసం వెయిట్ చేసి వుంటావని తెలుసును. మన బతుకులు అర్థం లేకుండా నడిచి, అర్థాంతరంగా ఎప్పుడో, ఎక్కడో ఆగిపోతుంటాయని కదూ- మనం యిన్నాళ్లూ అనుకుంటూ వచ్చాము! అబ్బే, అదేం కాదు, మన వూహాలు తప్పు మన నిరాశ అర్థం లేనిది, అని రుజువు చెయ్యగలిగే ఓ గొప్ప అనుభవం నిన్న సాయంత్రం నాకు కలగబోతోందని తెలిసింది. అదేమిటో పూర్తిగా తెలిసింతర్వాత, నీ దగ్గరకి పరిగెత్తుకొచ్చి, నిన్ను కూడా సంతోషంతో వుక్కిరి బిక్కిరి చేసి, బతుకులో మొదటిసారి నువ్వు మనస్ఫూర్తిగా, హాయిగా నవ్వుతుంటే చూడాలని ఎంత ముచ్చట పడ్డానో తెల్సునా?

సరే, విమానాశ్రయానికి వెళ్ళేను కదా- నేనెదురు చూస్తున్న ఫ్లయిట్ వస్తోందని ఎనౌన్స్ చేశారు. ముందుకు వెళ్లేను అద్దాల పార్టీషన్ దగ్గరికి. నా కోసం ప్రత్యేకంగా వొస్తున్న వ్యక్తిని- అతను విమానంలోంచి దిగి, నడచి వస్తుంటే చూడాలని ఆతురత, వెర్రి కోరిక. విమానం దిగుతోంది. ఇంతలో ఏ నయిందో తెలియదు- అకస్మాత్తుగా విమానానికి మంటలు అంటుకున్నాయి. మరుక్షణంలో పెద్ద విస్ఫోటంతో విమానం పేలిపోయింది. సామాన్లు, విమాన భాగాలు, ప్రయాణీకులు- సమస్తం-అగ్ని గోళాల్లా అంతటా ఎగిరి పడ్డాయి. నా కోసం వచ్చిన వ్యక్తి కూడా కాలి బొగ్గయిపోయి వుంటాడు. అద్దాల వెనకాతల నిలబడి జరుగుతున్న విధ్వంసాన్నంతట్నీ వివరంగా, నిదానంగా చూసేను. ఏదో జరుగుతుందని కొండంత ఆశతో వెళితే జరిగిందిది. వీధిలో ఏ సందు మలుపు తిరిగినా అసంబద్ధత **(Absurd)** మనకి దర్శనమిస్తుందని కమూ **(camus)** చెప్పడం మనకి తెలీదూ! అన్నీ తెలిసే పిచ్చి పిచ్చి కలలు కన్నాను. తల్చుకుంటే నాకే సిగ్గనిపిస్తోంది. ఇక ఈ బోర్ డమ్‌ని , అసంబద్ధతనీ భరించే శక్తి నాకు లేదు, వెళ్తున్నాను."

రజని వెళ్ళిపోయిందన్న మాట! ఇన్నాళ్ళూ ఈ ఒంటరి తనాన్ని భరించడానికి రజని నాకు తోడుందని ధైర్య పడుతూ వచ్చేను. ఇక నేనొక్కడ్నే భరించాలి. బాధతో మనసు మూలుగుతుంటే, ఏం చెయ్యడానికీ తోచక స్థాణువులా వుండిపోయాను చాలా సేపు. చివరికి మనసుని వుగ్గబట్టుకొని 'ఏం చెయ్యాలిప్పుడు' అని ఆలోచించేను. రెండు మార్గాలు కనపడ్డాయి. రజని వెళ్లిన తోవనే నేనూ వెళ్లిపోవడం, లేకపోతే, ఎప్పటికి యేదీ జరగదని తెల్సినా, ఎప్పటికేనా ఏదేనా జరుగుతుందని నిరీక్షిస్తూ గడపడం. ఏం చేస్తే బావుంటుందో ప్రొఫెసర్ డస్ట్‌కోట్‌గార్ని అడిగి తెల్సుకుంటే ఎలా వుంటుందని పించింది. ఆయన్ని వెతుక్కుంటూ చీకటి గుహలోకి ప్రవేశించేను.

## ఆత్మగడియారం

వెన్నెలపూదుల్తో రాత్రిని కుట్టేసే
కనుల పవితవంలో
స్వప్నాలు చిగురించటం లేదు

నిద్ర రాకుండా
పహరాలు కాస్తున్న రాత్రి
తొంగలి రెప్పల్ని దొంగిలించుకుపోయింది

పాడు కాలం
కన్నీళ్ళ ప్రవాహంలో పడి
కొట్టుకుపోతూ
కొట్టుకుపోతూ
ఆగిపోయిన గడియారాన్ని
వాడుకోమని ఇచ్చింది

ఈ ఆత్మకు
ఈత రాదు
మునిగిపోయే బరువూ లేదు...!

—సాంధ్యశ్రీ

"బస్సు వేగంగా వెళ్తున్నప్పుడు బ్రేకులు పని చెయ్యక పోతే ఏం చేస్తావు" అడిగాడు సురేష్, డ్రైవర్ ధర్మారావును...
"మా ఆవిడ్ని తలచుకుని దూకేసి తప్పించుకుంటాను" ఠఫీమని చెప్పాడు ధర్మారావు.

—జయశ్రీ మద్రాసు